క్లుప్తంగా

నేడు బుక్ డొనేషన్ డే

ధర్మవరం రూరల్: ఆర్డీటీ ఆధ్వర్యంలో బుక్ డొనేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆర్డీటీ అధికారులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పుస్తకాలు విరాళంగా ఇవ్వడం ద్వారా ఎంతో మంది పేద విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటాయన్నారు. పుస్తకాలు ఇవ్వాలనుకున్న దాతలు ఆర్డీటీ కార్యాలయానికి వచ్చి విరాళంగా ఇవ్వొచ్చని సూచించారు.

అక్కదేవతలకు పూజలు



బాబాసాహెబ్‌పల్లి వద్ద బావిలో అక్కదేవతలకు పూజలు చేస్తున్న భక్తులు

ఓడీ చెరువు: మండలంలోని బాబాసాహెబ్‌పల్లి, దాదిరెడ్డిపల్లి గ్రామాల్లో వెలసిన అక్కదేవతలకు సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. బాబాసాహెబ్‌పల్లి గ్రామ సమీపంలోని బావిలో అక్కదేవతల ప్రతిమలకు ప్రత్యేక అలంకరణ చేసి కొలువు తీర్చారు. ఆలయ పూజారి ఎం.ఎస్.షబ్బీర్ అక్కదేవతలకు పసుపు, కుంకుమ, నల్లగాజులతో పచ్చ వేశారు. పవిత్రంగా భావించే బావిలో గంగాజల హారతి ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. విచ్చేసిన భక్తులకు అన్నదానం చేశారు. దాదిరెడ్డిపల్లిలో ఆలయ పూజారి వెంకటేష్ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదాలు అందచేసి అన్నదానం చేశారు.

వేరుశనగ మిల్లు ప్రారంభం రేపు

తాడిమర్రి: మండల కేంద్రంలో ఈనెల 15వ తేదీన రైతు సహకార సమాఖ్య ఆధ్వర్యంలో వేరుశనగ మిల్లును ప్రారంభిస్తున్నట్లు ఆ సమాఖ్య సభ్యులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన కొందరు రైతులు శ్రీసత్యసాయి రైతు పరస్పర సహకార పరపతి సమాఖ్య ఏర్పాటు చేసుకున్నారు. శివంపల్లి రహదారిలో ఉన్న రైస్‌మిల్లును లీజుకు తీసుకుని వేరుశనగ మిల్లుగా మార్చారు. కలెక్టర్ బసంత్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై మిల్లును ప్రారంభిస్తారని సమాఖ్య సభ్యులు పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

బత్తలపల్లి: కుక్కను తప్పించబోయి కింద పడిన ఘటనలో తీవ్రంగా గాయపడి, కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి ఆదివారం మృతి చెందాడు. వివరాలు.. ధర్మవరం మండలం మల్కాపురం గ్రామానికి చెందిన అంగజాల ఆదెప్ప, అంగజాల జయరాముడు (37) అన్నదమ్ములు. ఈనెల 11వ తేదీన ఇద్దరూ వ్యక్తిగత పని నిమిత్తం ద్విచక్ర వాహనంలో అనంతపురం వెళ్లారు. తిరుగు ప్రయాణంలో మండలంలోని రాఘవంపల్లి క్రాస్ వద్దకు రాగానే కుక్క అడ్డగా వచ్చింది. కుక్కను తప్పించే ప్రయత్నంలో బైక్ అదుపు తప్పింది. ఈ ఘటనలో వాహనం నడుపుతున్న ఆదెప్పకు స్వల్ప గాయాలయ్యాయి. జయరాముడు తల, కాళ్లకు తీవ్రగాయాలు కావడంతో అనంతపురం తీసుకువెళ్లారు. అక్కడ నుంచి కర్నూలుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య శివమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

అమడగూరు: ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో బహిరంగ ప్రదేశాల్లో రాజకీయ పార్టీలకు చెందిన ఫ్లెక్సీలు, వాల్ పోస్టర్లు తొలగించాలని డిప్యూటీ తహసీల్దార్ రెడ్డిశేఖర్, ఎస్ఐ వెంకటనారాయణ తెలిపారు. సోమవారం వారు అమడగూరులోని వీధుల్లో పర్యటించి, గ్రామస్తులతో మాట్లాడారు. మార్చి 13వ తేదీ వరకూ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుందని పేర్కొన్నారు. కోడ్ అమల్లో ఉన్న సమయంలో ఎలాంటి రాజకీయ పార్టీలకు సంబంధించి ఫ్లెక్సీలు, నేతల స్టిక్కర్లు, గోడ ప్రతులు అతికించడానికి వీల్లేదన్నారు. అలాగే గతంలో ఉన్నవాటిని అన్ని పంచాయతీల్లో తొలగించాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. నిబంధనలు విరుద్ధంగా ప్రవర్తిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య



అశోక్ మృతదేహం

నల్లమాడ: అనారోగ్య పరిస్థితులు తాళలేక ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... పుట్టపర్తి మండలం కంబాలపర్తి గ్రామానికి చెందిన కొట్టం రమణప్ప కుమారుడు అశోక్ (16) హిందూపురం సమీపంలోని మలుగూరు వద్ద ఉన్న ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఆరోగ్యం సరిగా లేకపోవడంతో మూడు రోజుల క్రితం ఇంటికి వచ్చాడు. సోమవారం ఉదయం కళాశాలకు వెళ్లాల్సి ఉంది. సోమవారం తెల్లవారుజామున బహిర్భూమికి వెళుతున్నట్లు ఇంట్లో చెప్పి బయటకు వచ్చిన అశోక్.. గ్రామ శివారులోని చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న తల్లిదండ్రులు అక్కడకు చేరుకుని కుమారుడి మృతదేహం చూసి బోరున విలపించారు. అశోక్ తండ్రి రమణప్ప ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

అబ్బురపరిచిన ప్రాజెక్టులు



ప్రాజెక్టులతో సిద్ధంగా ఉన్న విద్యార్థినులు

పుట్టపర్తి మండలంలోని జగరాజుపల్లి మంగళకర ట్రస్ట్‌లో సోమవారం జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. విద్యార్థులు తమ మేధస్సుకు పదును పెడుతూ అద్భుతమైన ప్రాజెక్టులు తయారు చేశారు. కొంత మంది విద్యార్థులు ప్రభుత్వ పథకాలపై ప్రాజెక్టులు తయారు చేయగా.. పలువురు ప్రకృతి రక్షణ, పర్యావరణ పరిరక్షణ కోసం రీసైక్లింగ్, విద్యుత్ ఉత్పత్తి, సాంకేతిక పరిజ్ఞానంపై ప్రదర్శనలు చేశారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన జిల్లా కలెక్టర్ బసంత్‌కుమార్, ఇన్‌చార్జ్ డీఈఓ మీనాక్షి ప్రాజెక్టులను ఆసక్తిగా తిలకించారు. ఈ వైజ్ఞానిక సదస్సును చూసేందుకు పలు విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు తరలివచ్చారు. – పుట్టపర్తి అర్బన్



వృథా వస్తువులతో తయారు చేసిన ప్రాజెక్టుల ప్రదర్శన



సెన్సార్‌తో నడిచే వాహనాన్ని పరిశీలిస్తున్న అధికారులు



పిడకలు తయారు చేసే పరికరం పనితీరును వివరిస్తున్న దృశ్యం

సత్యసాయి ట్రస్ట్‌కు కృతజ్ఞతలు



ట్రస్ట్ సభ్యుడు రత్నాకర్‌ను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు

పుట్టపర్తి టౌన్: రాష్ట్రంలోని గవర్నమెంట్ పాఠశాలలకు రోజూ రాగి జావా అందించేందుకు సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ ముందుకు రావడం హర్షణీయమని మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబుళపతి, వైస్ చైర్మన్‌లు శ్రీలక్ష్మి, తిప్పన్న అన్నారు. సోమవారం సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యుడు ఆర్‌జే రత్నాకర్‌ను మున్సిపల్ చైర్మన్ నివాసం వద్ద సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పాఠశాలలకు రాగి జావా పంపిణీ చేయడం ఒక్క సత్యసాయి ట్రస్ట్‌కు సాధ్యమని కొనియాడారు. ఈ బృహత్కర కార్యక్రమానికి ట్రస్ట్ ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నెడ్ క్యాప్ డైరెక్టర్ మాధవరెడ్డి, మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబుళపతి, వైస్ చైర్మన్లు శ్రీలక్ష్మి, తిప్పన్న, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ రంగారెడ్డి, కౌన్సిలర్లు చెరువు భాస్కర్‌రెడ్డి, సాయిగీత, మాజీ కౌన్సిలర్ నారాయణరెడ్డి, నాయకులు బ్రిక్స్ సాయి, కవిత, భాస్కర్‌రెడ్డి, శంకర, మల్లికార్జున రెడ్డి, సుధీర్‌రెడ్డి, నరశింహులు, కేశప్ప, రామయ్య, రమేష్, పాల్గొన్నారు.

షూటింగ్ బాల్ పోటీల్లో ప్రతిభ



ముదిగుబ్బ: ప్రతిభ కనబరిచిన విద్యార్థినులను అభినందిస్తున్న దృశ్యం



నల్లమాడ: విద్యార్థినులతో కస్తూర్బా పాఠశాల ఎస్ఓ, ఉపాధ్యాయినులు

ముదిగుబ్బ: రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ చాంపియన్ షిప్ పోటీల్లో స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు ప్రతిభ కనబరిచినట్లు ప్రధానోపాధ్యాయురాలు ఎలిజిబెత్, అసోసియేషన్ ఇన్‌చార్జ్ సెక్రటరీ పూల ప్రసాద్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కృష్ణా జిల్లా హనుమాన్ జంక్షన్‌లో ఈనెల 10 నుంచి 12వ తేదీ వరకూ జరిగిన ఆంధ్రప్రదేశ్ 41వ సీనియర్ రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ చాంపియన్ షిప్ పోటీల్లో తొమ్మిదో తరగతి చదువుతున్న ఎస్.రోషిణి, హసీన, తీర్థ జట్టు తరఫున పాల్గొని సత్తా చాటారన్నారు. విద్యార్థినులను పాఠశాల సిబ్బంది అభినందించారు. కార్యక్రమంలో పీడీ పి.రేఖ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నల్లమాడ: ఈనెల 10 నుంచి 12 వరకూ కృష్ణా జిల్లా హనుమాన్ జంక్షన్‌లో జరిగిన 41వ సీనియర్ రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ చాంపియన్ షిప్ పోటీల్లో స్థానిక కస్తూరిబా పాఠశాల విద్యార్థినులు ప్రతిభ కనబరిచారు. 8వ తరగతి విద్యార్థినులు బీ.జ్యోష్ణ, వై.ప్రవల్లిక, వీ.నందిని, బీ.స్వాతి, టీ.సబీనా, జీ.సుకేషిని ప్రశంసా పత్రాలు పొందినట్లు కస్తూరిబా పాఠశాల ఎస్ఓ శోభారాణి తెలిపారు. విద్యార్థినులను ఎస్ఓతో పాటు పీఈటీ స్వర్ణకుమారి అభినందించారు.

ఉత్సవాలు శాంతియుతంగా జరుపుకోండి



పోలీసు, రెవెన్యూ అధికారులు, గ్రామస్తులతో చర్చిస్తున్న ఆర్డీఓ తిప్పేనాయక్

ధర్మవరం: తాడిమర్రి మండలంలోని చిల్లవారిపల్లి కాటికోటేశ్వరస్వామి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఆర్డీఓ తిప్పేనాయక్ తెలిపారు. పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం రాత్రి అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈనెల 18న మహాశివరాత్రి సందర్భంగా కాటికోటేశ్వరస్వామి ఉత్సవాలను ఆలయ కమిటీ సభ్యులు ఎటువంటి సమస్యలు లేకుండా ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. గత ఏడాది కాటకోటేశ్వర స్వామి ఉత్సవాల్లో గొడవలు జరిగాయన్నారు. ఈ ఏడాది అటువంటి గొడవలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ధర్మవరం ఇన్‌చార్జ్ డీఎస్పీ హుసేన్ పీరా, ముదిగుబ్బ సీఐ, తాడిమర్రి ఎస్ఐ, ఆలయ కమిటీ చైర్మన్లతో చర్చించారు. పూజలు ఎలా చేయాలో నిర్ణయించారు. మహాశివరాత్రి రోజు ఉదయం 9 గంటలకు గతంలో ఎలా పూజలు చేసేవారో ఆవిధంగా పూజలు చేసేలా నిర్ణయించారు. సమావేశంలో ముదిగుబ్బ సీఐ కంబగిరిరాముడు, తాడిమర్రి ఎస్ఐ లక్ష్మీనారాయణ, ఆలయ చైర్మన్ నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సంగీత కచేరీ



భక్తి గీతాలు ఆలపిస్తున్న విద్యార్థులు

ప్రశాంతి నిలయం: సత్యసాయి విద్యాసంస్థల చిన్నారులు చక్కటి స్వరాలొలికిస్తూ నిర్వహించిన సంగీత కచేరీ భక్తులను అలరించింది. సోమవారం సాయంత్రం సత్యసాయి హయ్యర్ సెకెండరీ స్కూల్‌కు చెందిన 10, 12వ తరగతి విద్యార్థులు సంగీత కచేరి నిర్వహించారు. సత్యసాయిని కీర్తిస్తూ నిర్వహించిన కచేరీతో సాయికుల్వంత్ సభా మందిరం మార్మోగింది. అంతకుముందు ఆల్ ఇండియా సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకెండరీ ఎడ్యుకేషన్ 2020, 2021, 2022 సంవత్సరాల్లో నిర్వహించిన పబ్లిక్ పరీక్షలలో టాపర్స్‌గా నిలిచిన విద్యార్థులకు సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్ రాజు చేతుల మీదుగా ట్రోఫీలు అందజేశారు. అనంతరం విద్యార్థులు సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

పెద్దకోట్లలో ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలు

తాడిమర్రి: మండలంలోని పెద్దకోట్ల గ్రామంలో వైద్య సిబ్బంది సోమవారం గ్రామస్తులకు వైద్య చికిత్సలు అందించారు. ఫ్యామిలీ ఫిజీషియన్ సేవల్లో భాగంగా 104 వాహనం సిబ్బంది ఎంపీహెచ్ఓ నారాయణస్వామి, ఎంఎల్‌హెచ్ఓ హేమలత తదితర వైద్య సిబ్బంది గర్భిణులు, బాలింతలు, వృద్ధులకు బీపీ, షుగర్, రక్త, మూత్ర పరీక్షలు చేశారు. గ్రామంలో ఇంటింటా తిరుగుతూ దీర్ఘకాలిక రోగాలతో మంచం పట్టిన రోగులకు వైద్య చికిత్సలు అందించి, మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తాజా కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, పాలు, చేపలు, మాంసం తదితర పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. శరీరానికి కావాల్సిన పోషక విలువలు అందడంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు.

బాలలను పనిలో పెట్టుకోవద్దు



రైస్‌మిల్లును పరిశీలిస్తున్న అధికారులు

తనకల్లు: కార్మికులకు యజమానులు పనికి తగిన వేతనాన్ని చెల్లించాలని కదిరి డివిజన్ లేబర్ ఆఫీసర్ జహురుద్దీన్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని కొక్కంటి క్రాస్‌లో ఉన్న ఇటుకల బట్టీలు, రైస్‌మిల్లులో పని చేస్తున్న కార్మికులతో ఎస్ఐ రాంభూపాల్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికుల చట్టం ప్రకారం వేతనాలను చెల్లించాలని ఆదేశించారు. కార్మికులతో రోజుకు 8 గంటలు మాత్రమే పని చేయించుకోవాలన్నారు. పనికి తగిన వేతనాలు ఇవ్వకుండా వెట్టి చాకిరీ చేయించుకునే సంస్థల యాజమాన్యాలపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్మికులకు సరైన వేతనాలు చెల్లించకుండా వేధింపులకు గురి చేస్తే తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. బాలలను పనిలో పెట్టుకోవడం చట్టరీత్యా నేరమన్నారు. బాలలను కార్మికులుగా మార్చాలని ప్రయత్నిస్తే కేసులను నమోదు చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మహిళా పోలీస్ తరానా తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సహకారంతో పేదలకు ఇళ్ల పట్టాలు



ఇళ్ల నిర్మాణాలకు భూమి పూజ చేస్తున్న దృశ్యం

కనగానపల్లి (రామగిరి): రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సహకారంతో రామగిరి మండలం నసనకోట లో పేదలకు ఇంటి పట్టాలు పంపిణీ చేసినట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రమేష్ తెలిపారు. సోమవారం స్థానిక ఎస్సీ కాలనీలో పట్టాలు పొందిన లబ్ధిదారులతో కలసి మండల ప్రజా ప్రతినిధులు, నాయకులు ఇళ్ల నిర్మాణాలకు భూమి పూజ చేశారు. వారు మాట్లాడుతూ నసనకోట గ్రామంలోని ఎస్సీ కాలనీవాసులు సొంత ఇళ్లు లేక చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. గతంలో టీడీపీ నాయకులు ఓట్లు వేయించుకొని మోసం చేశారన్నారు. ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి పేదలందరికీ ఇంటి పట్టాలు ఇప్పించి, ఆర్డీటీ సహకారంలో ఇళ్లు నిర్మించి ఇస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కర్రెన్న, జెడ్పీటీసీ సభ్యుడు నాగార్జున, ముత్యాలమ్మ ఆలయ కమిటీ చైర్మన్ ముత్యాలు, సింగిల్ విండో అధ్యక్షుడు హెచ్ఎస్ ముత్యాలు, నాయకులు ఆదిరెడ్డి, జేష్ఠ రామయ్య, మోహన్, రామాంజి, తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ఆస్తులకు నష్టం కలిగిస్తే చర్యలు

ధర్మవరం: ధర్మవరం రైల్వే పరిధిలోని ఆస్తులపై దాడి చేసి నష్టం కలిగిస్తే తీవ్రమైన చర్యలు తీసుకుంటామని రైల్వే ఆర్‌పీఎఫ్ సీఐ బోయ కుమార్ తెలిపారు. స్థానిక రైల్వేస్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భారతీయ రైల్వే అధికారుల ఆదేశాల మేరకు ఇక నుంచి రైల్వే ఆస్తులపై ఎటువంటి దాడులు చేసినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. రైల్వే చట్టం ప్రకారం కఠిన చర్యలతో పాటు జైలు శిక్ష కూడా విధించడం జరుగుతుందన్నారు. ఇటీవల ప్రారంభించిన వందే భారత్ రైలుపై దాడులు జరిగాయన్నారు. ఇక నుంచి ఎవరైనా దాడులకు పాల్పడితే ఉపేక్షించేది లేదన్నారు. మూడు సంవత్సరాల వరకూ జైలు శిక్ష ఉంటుందన్నారు. గ్రామాల ప్రజలకు అవగాహన కల్పించి, రైల్వే ఆస్తులకు భద్రత కల్పిస్తామని తెలిపారు. కొంత మంది యువకులు మద్యానికి బానిసై సరదాగా తీసుకుని ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడిన సంఘటనలు ఉన్నాయని చెప్పారు.

ఆత్మీయ కలయిక



కొత్తచెరువు: రెండు మూడు తరాలకు చెందిన కుటుంబసభ్యులు తమ అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ ఏకమయ్యారు. ఇందుకు కొత్తచెరువు వేదికైంది. గ్రామంలోని కరణం వెంకటాచలపతి రావు (లేట్) కుటుంబసభ్యుల ఆత్మీయ కలయిక స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయంలో సోమవారం జరిగింది. 1890 నుంచి 1974 వరకు జీవించిన వెంకటాచలపతిరావు కుటుంబానికి చెందిన రెండు, మూడు తరాల వారు వివిధ ప్రాంతాల్లో ఉద్యోగ, వ్యాపారాల్లో స్థిరపడ్డారు. ఈ క్రమంలో దాదాపు 105 మంది సభ్యులు ఒక చోట చేరి తమ అనుబంధాన్ని మరింత బలపరుచుకున్నారు.

వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి

ధర్మవరం అర్బన్: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి నడపాలని, అప్పుడే ప్రమాదాలు జరగవని ఏపీ రైతు కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జేవీ రమణ, సీపీఐ పట్టణ కార్యదర్శి ముసుగు మధు అన్నారు. సోమవారం స్థానిక బీఎస్ఆర్ బాలికల ఉన్నత పాఠశాలలో ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా అధ్యక్షుడు నరేష్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు అల్పాహారాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదంలో ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా అధ్యక్షుడు నరేష్ 8 ఏళ్ల క్రితం మృతి చెందాడన్నారు. కార్యక్రమంలో మాజీ విద్యార్థి సంఘాల నాయకులు శీలా విజయ్, ప్రసాద్, మూర్తి, చేనేత కార్మిక సంఘం నాయకులు బైముతక రమణ, రైతు సంఘం నాయకుడు శ్రీరాములు పాల్గొన్నారు.

రుణాలు సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ నరసయ్య

అమడగూరు: డ్వాక్రా సంఘాల ద్వారా తీసుకునే రుణాలను సభ్యురాళ్లు సద్వినియోగం చేసుకునేలా యానిమేటర్లు కృషి చేయాలని డీఆర్‌డీఏ పీడీ నరసయ్య పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఐకేపీ కార్యాలయంలో యానిమేటర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ.. ప్రతి 4 సంఘాలకు ఒక బుక్ కీపర్ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ప్రతి వారం వీఓ కార్యాలయంలో సభ్యురాళ్లందరూ కలసి రికార్డులను పరిశీలించుకోవడం, తప్పొప్పులు సరి చేసుకోవడం చేయాలన్నారు. అలాగే సంఘాలను ఏర్పాటు చేయడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. గ్రామ సంఘం సహాయకులను ఎంపిక చేయడం, వారి విధులు, బాధ్యతలు, గౌరవ వేతనాల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో ఏపీ రామ్మోహన్, ఏపీఎం గోపాల్, వీఓ లీడర్, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధ దంపతుల సాహసం

- గుజరాత్ నుంచి రామేశ్వరానికి పాదయాత్ర
- రామలింగేశ్వరుడి దర్శనం అనంతరం తిరిగి గుజరాత్‌కు



బత్తలపల్లిలో పాదయాత్ర చేస్తున్న దంపతులు

బత్తలపల్లి: ఏడు పదుల వయసులో విశ్రాంతి తీసుకోకుండా వృద్ధ దంపతులు గుజరాత్ నుంచి రామేశ్వరానికి తిరిగి రామేశ్వరం నుంచి గుజరాత్‌కు పాదయాత్రగా బయలుదేరారు. సోమవారం ఉదయం వీరు బత్తలపల్లికి చేరుకున్నారు. వివరాలు... గుజరాత్‌కు చెందిన విశ్రాంత ప్రిన్సిపాల్ సరోజా, విశ్రాంత ప్రొఫెసర్ ఉపాధ్యాయ.. ఇద్దరూ దంపతులు. ఇద్దరూ లండన్ యూనివర్సిటీలో చదువుకున్నారు. నాలుగు నెలల క్రితం గుజరాత్‌లోని ద్వారం నుంచి పాదయాత్రగా రామేశ్వరానికి బయలుదేరిన వీరు.. రామలింగేశ్వరుడి దర్శనం అనంతరం తిరిగి గుజరాత్‌కు పాదయాత్రగా బయలుదేరారు. మధ్యలో వివిధ రాష్ట్రాల్లోని ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రాలను దర్శించుకున్నారు. ఇప్పటి వరకూ ఐదు వేల కిలోమీటర్ల మేర తమ పాదయాత్ర సాగిందని, మరో వెయ్యి కిలోమీటర్లు ప్రయాణిస్తే తమ యాత్ర పూర్తవుతుందని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. గుజరాత్‌లో అనాథ పిల్లల, అంధుల ఆశ్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాదయాత్రలో తమకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

యోగా అసోసియేషన్ నూతన కమిటీ ఎంపిక

ధర్మవరం అర్బన్: ధర్మవరం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం పట్టణ యోగా అసోసియేషన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా గాజుల సోమేశ్వర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా ఆది, యోగా మాస్టర్‌గా తిరుమలేసు, జాయింట్ కార్యదర్శిగా నరసింహులు, సబ్ జాయింట్ కార్యదర్శిగా ఈశ్వరయ్య, కోశాధికారిగా కట్టా రవికుమార్, సభ్యులుగా వేణుగోపాల్ తదితరులను ఎంపిక చేశారు. అసోసియేషన్ సభ్యుల పదవీ కాలం రెండు సంవత్సరాలు ఉంటుందని నూతన అధ్యక్షుడు గాజుల సోమేశ్వర్ రెడ్డి తెలిపారు.

ప్రతి కూలీకి పని కల్పించాలి

కొత్తచెరువు: గ్రామీణులు వలసలు పోకుండా ఉపాధి పనులు కల్పించాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు రామాంజనేయులు తెలిపారు. సోమవారం మండల పరిధిలోని బైరాపురం పంచాయతీలో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద అమృత్ సరోవర్ పనులను ఆయన ప్రారంభించారు. ఉపాధి సిబ్బంది ప్రతి పంచాయతీలో అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. ఆయన వెంట ఏపీడీ రఘునాథ్ రెడ్డి, ఏపీఓ నాగిరెడ్డి, సహాయకులు శ్రీనివాసులు, సురేంద్రనాథ్ రెడ్డి, మనోహర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు



గెలుపొందిన విద్యార్థులతో ఆర్డీటీ సిబ్బంది

గాండ్లపెంట: గాండ్లపెంట, ఎన్‌పీకుంట మండలాల్లోని 6 క్లస్టర్‌లకు చెందిన 4, 5 తరగతుల విద్యార్థులకు సోమవారం స్థానిక ఆర్డీటీ ఏరియా కార్యాలయంలో ఏటీఎల్ కృష్ణ ఆధ్వర్యంలో క్విజ్ పోటీలు నిర్వహించారు. 16 మంది విద్యార్థులను బృందాలుగా విభజించి, తెలుగు, గణితం, సైన్స్, సాంఘికశాస్త్రంలోని పాఠ్యాంశాలకు సంబంధించిన ప్రశ్నలు అడిగారు. పోటీల్లో మొదటి స్థానంలో నిలిచిన దినేష్, సతీష్‌నాయక్, మౌనిశ్రీ, గాయత్రికి ఎంఈఓ కృష్ణా నాయక్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. మండల స్థాయిలో ఎంపికైన విద్యార్థులను రీజనల్ స్థాయిలో ఈ నెల 23న జరిగే క్విజ్ పోటీలకు ఎంపిక చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో సీఓలు లక్ష్మన్న, నారాయణ, నాగమణి, నవీన్, రామాంజనేయులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోండి

ముదిగుబ్బ: విద్యుదాఘాతంతో మృతి చెందిన రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ నాయకులు జేవీ రమణ, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీరాములు కోరారు. ఈనెల 10న మండల పరిధిలోని కొడవండ్లపల్లి గ్రామానికి చెందిన రైతు రామిరెడ్డి విద్యుదాఘాతంతో మృతి చెందాడు. మృతుడి కుటుంబానికి విద్యుత్ శాఖ తరఫున నష్ట పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు.